ప్రజాశక్తి
సోమవారం 21 ఏప్రిల్ 2025

ఆ పోస్టులను డిఎస్‌సిలో కలపడం అన్యాయం

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, సిఆర్‌టిల పోస్టులను డిఎస్సీలో కలపడం అన్యాయమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు ఒక ప్రకటనలో చెప్పారు. గత 15 ఏళ్లుగా పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, సిఆర్టీల్లో ఎక్కువ మంది గిరిజనులు, బిసిలు ఉన్నారని చెప్పారు. వీరి కుటుంబాలు రోడ్డున పడతాయని చెప్పారు. పనిచేస్తున్న ఉపాధ్యాయులను తొలగించి కొత్త వారికి ఇవ్వడం కరెక్ట్ కాదన్నారు. ప్రభుత్వం వీరి గురించి ఒక నిర్ణయం తీసుకోవాలని, లేని పక్షంలో పోరాటం చేపడతామని మురళీమోహన్‌రావు ఆ ప్రకటనలో హెచ్చరించారు.

జెసిబిని, పోలీసులను గ్రామంలోకి రానీయకుండా అడ్డుకున్న గ్రామస్తులు; దగ్గరుండి జెసిబితో నిర్మాణాలను కూలదోయిస్తున్న తహశీల్దార్, పోలీసులు

బంటువానివలసపై రెవెన్యూ, పోలీసుల దాడి

- మహిళలు, వృద్ధులపై పోలీసుల దౌర్జన్యం
- రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల అరెస్ట్
- ఆక్రమణ కాదు.. అధికార ముద్రతో భూ పట్టా
- బుల్డోజర్ రాజకీయాల్ని సహించం: సిపిఎం
- నేడు కలెక్టరేట్ వద్ద ధర్నాకు నిర్వాసితుల సంఘం పిలుపు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

భూ ఆక్రమణను అడ్డుకోవాల్సిన ప్రభుత్వం ఇంతటి దారుణానికి ఒడికట్టడం అన్యాయమని రైతు సంఘం జిల్లా ఎం.కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని బంటువానివలసలో నెలకొన్న భూ వివాదంపై పోలీసు, రెవెన్యూ అధికారులు జెసిబి సహాయంతో పెద్ద ఎత్తున తొలగింపునకు పాల్పడ్డారు. మొదటగా ఈ దౌర్జన్యాన్ని ఖండిస్తూ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, సిఐటియు నాయకులు బి.సూరిబాబు, గ్రామానికి చెందిన మహిళలు, వృద్ధులు పెద్ద ఎత్తున పోలీసులను, జెసిబిని గ్రామం లోపలికి రానివ్వకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. అందులో భాగంగా ఎం.కృష్ణమూర్తి, కొల్లి గంగునాయుడు, బంటు ప్రవీణ్‌తో పాటు సుమారు తొమ్మిది మంది గ్రామస్తులను అరెస్ట్ చేసి పట్టణ పోలీస్ స్టేషన్కు తరలించారు. వీరిపై 107 బైండోవర్ కేసు పెట్టి ఆదివారం సాయంత్రం విడుదల చేశారు. అనంతరం పోలీసులు దౌర్జన్యంగా ప్రజలందర్నీ అదుపు చేసి జెసిబితో స్థలంలో ఉన్న గోడలను, మామిడి, కొబ్బరి చెట్లను పూర్తిగా తొలగించారు. ఈ అన్యాయాన్ని ఖండిస్తూ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో బుల్డోజర్ రాజకీయాలు మొదలైందని, ఇది అన్యాక్రాంతం భూమి కాదని, ప్రభుత్వం మాత్రం అన్యాయంగా పేదల భూములపై ఒడిగడుతుందని అన్నారు. జిల్లాలో అనేక భూములు, చెరువులు కబ్జాలకు గురయ్యాయని, వీటినన్నింటినీ పక్కన పెట్టేసి అధికారికంగా భూ పట్టాలు తెచ్చుకున్న భూములపై రాజకీయ అండదండలతో అధికార యంత్రాంగాన్ని ఉపయోగించి ఇటువంటి దారుణానికి పాల్పడడం దుర్మార్గమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగనాయుడు మాట్లాడుతూ ఇది కేవలం రాజకీయ కుట్రలో భాగమైనని, రాజకీయంగా ఎదుర్కోలేక కొంతమంది దళారుల దన్నుతో అధికారులు ఈ నీచపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. పట్టణంలో దేవునిబంద ఆక్రమణకు రెండు నెలల క్రితమే రెవెన్యూ అధికారులు ఎరుపురంగుతో మార్కులు వేశారని, వాటిపై నేటికీ ఎందుకు చర్యలు చేపట్టలేదని నిలదీశారు. పంచాయతీ తీర్మానంతో ఆమోదం పొంది, పేదలకు చెందిన భూములను ఆక్రమణగా చిత్రీకరించి స్థానిక ప్రభుత్వం, అధికారులు ఈ దాడికి పాల్పడ్డారని తెలిపారు. ఈ దాడి కేవలం ఒక వ్యక్తిపై జరిగింది కాదని, తోటపల్లి నిర్వాసితులపై కుట్రపూరితంగా పక్కా ప్రణాళికతో పూనుకుందని, దీన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తున్నామని అన్నారు. భూ పోరాటాల సమస్యల్లో భాగంగా సోమవారం పెద్ద ఎత్తున కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడతామని తెలిపారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు మాట్లాడుతూ నిర్వాసితుల పోరాట ఫలితంగా సర్వే నెంబరు 57లో 1, 3 2007లో పట్టాలిచ్చేటప్పుడు తనకు ఇచ్చిన పట్టా పక్కనే రామాలయ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించారని తెలిపారు. ఇది వాస్తురీత్యా సరైన స్థలం కాకపోవడంతో గ్రామస్తుల ఒత్తిడి కారణంగా ఆమోదం పొంది ఇంకులు సుబ్బారావుకు చెందిన 70:30 స్థలంలో రూ.30 లక్షలు సొంత ఖర్చుతో రామాలయం పూర్తి చేసి గ్రామానికి ఇచ్చానన్నారు. రామాలయానికి కేటాయించిన స్థలానికి ఆనాటి తహశీల్దార్ రిజిస్ట్రేషన్‌లో కొన్ని సాంకేతికమైన సమస్యలున్నాయని సలహా ఇవ్వడంతో వెంటనే తన భార్యన ఉన్న రిజిస్టర్ పేరును తొలగించి గ్రామంలో గల మరో ఇద్దరు పేరున రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. స్థానిక గ్రామస్తుడైన మర్రాపు పోలినాయుడు వ్యక్తిగత కక్షపూరితంగా గ్రామ తీర్మానాన్ని వ్యతిరేకించి కోర్టులో కేసు వేస్తే కోర్టు తీర్పును వ్యతిరేకించకుండా కట్టుబడి పూనుకునే సందర్భం ఉందని తెలిపారు. ఇటువంటి నేపథ్యంలో కనీస పట్టాదారులకు కూడా అధికారులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఇటువంటి దుర్మార్గానికి పాల్పడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక స్థానిక ప్రజాప్రతినిధులు ఇటువంటి సిగ్గుమాలిన రాజకీయాలకు ఒడిగడుతున్నారని, వీటికి భయపడే ప్రసక్తే లేదని తెలిపారు. అన్యాయంగా జరిగిన ఈ దాడిని, న్యాయ పోరాటంగా ఎదుర్కొం టానన్నారు. ఇందులో భాగంగా సోమవారం పెద్ద ఎత్తున స్థానిక తహశీల్దార్, కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా చేయనున్నట్టు తెలిపారు. కావున నిర్వాసితులంతా పెద్ద ఎత్తున కదలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గ్రామస్తులను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు ; అధికారులను, పోలీసులను నిలదీస్తున్న ప్రజాసంఘాల నాయకులు, గ్రామస్తులు

నిరీక్షణకు తెర

- డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల
- ఉమ్మడి జిల్లాకు 446 పోస్టులు.. ఆశ్రమ పాఠశాలల్లో 137..
- పిఇటిలకు నిరాశ
- వేళల్లో అభ్యర్థులు.. వందల్లో పోస్టులు



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆరేళ్లుగా ఎదురుచూస్తున్న డిఎస్‌సి నోటిఫికేషన్ ఎట్టకేలకు విడుదలైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పది నెలలుగా ఊరిస్తున్న ఉపాధ్యాయ పోస్టుల నోటిఫికేషన్‌ను ఆదివారం విడుదల చేసింది. నోటిఫికేషన్‌లో ఉమ్మడి విజయనగరం జిల్లాకు అన్ని సబ్జెక్టులకు కలిపి 446 పోస్టులు కేటాయించింది. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు సంబంధించి మరో 137 పోస్టులున్నాయి. రాష్ట్రంలో 16,347 పోస్టులతో డిఎస్‌సి ప్రకటించగా, ఉమ్మడి విజయనగరం జిల్లాలో పోస్టుల వివరాలు ఇలా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్-1 : 14, హిందీ : 14, ఇంగ్లీష్ : 23, బయోలాజికల్ సైన్స్ 20, గణితం : 8, ఫిజికల్ సైన్స్: 32, సోషల్ : 62, పీడీ : 63, ఎస్‌జిటి 219 పోస్టులున్నాయి. మొత్తం 446 పోస్టులు కేటాయించారు. వీటితోపాటు సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు సంబంధించి ఇంగ్లీష్ : 7, గణితం : 25, ఫిజికల్ సైన్స్ : 24, బయోలాజికల్ సైన్స్ :16, సోషల్ : 5, ఎస్‌జిటి : 60 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తం 137 పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పోస్టులకు ఆదివారం నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించారు. జూన్ ఆరో తేది నుంచి ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు.

పిఇటి అభ్యర్థులకు నిరాశ

డిఎస్‌సి నోటిఫికేషన్‌లో ఉమ్మడి విజయనగరం జిల్లాలో పిఇటి పోస్టుల కోసం ఎదురుచూసిన అభ్యర్థులకు నిరాశ మిగిలింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో వ్యాయామ విద్యను అందించే పిఇటి ఖాళీలు ఒక్కటి కూడా నోటిఫికేషన్‌లో పేర్కొనలేదు. దీంతో ఉమ్మడి విజయనగరం జిల్లాలో పిఇటి శిక్షణ పొందిన అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లినట్లు అయింది. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

వేలల్లో అభ్యర్థులు

ఉత్తరాంధ్ర ఐఎఎస్‌గా పేరు గాంచిన ఉపాధ్యాయ పోస్టులకు వేల సంఖ్యలో అభ్యర్థులు బిఇడి, డైట్, వ్యాయామ ఉపాధ్యాయ శిక్షణ పొంది సిద్ధంగా ఉన్నారు. జిల్లాలో డిఎస్‌సి కోసం 25 వేల నుంచి 30 వేల మంది ఎదురు చూస్తున్నారు. మరో వైపు ప్రభుత్వం వయసు సడలింపు ఇవ్వడంతో మరో ఐదు వేల మంది పెరిగే అవకాశం ఉంది. తక్కువ పోస్టులు కావడంతో ఇతర జిల్లాలకు వెళ్లే అవకాశం ఉంది.

23న సాలూరులో జాబ్ మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం

సాలూరు శ్రీ సత్యసాయి డిగ్రీ కళాశాలలో ఈ నెల 23బీ జాబ్ మేళా జరగనుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకనటలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, ఏదైనా డిగ్రీ చదువుకొని 18 నిండి 28 ఏళ్ల ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళాకు అర్హులన్నారు. తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈరోజున జరిగే జాబ్ మేళాకు హాజరుకావచ్చని చెప్పారు. ఈ జాబ్ మేళాలో 11 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారని తెలిపారు. కావున ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను https://naipunyam. ap.gov.in వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబరుతో పాటు బయో డేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జెరాక్స్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో హాజరు కావాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 94947 77553, 73825 59022 మొబైల్ నెంబర్లను సంప్రదించవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

మక్కువ రోడ్డుకు మోక్షం లేనట్లే?

నిధుల దారి మళ్లింపుతో పనులకు ఆటంకం

వాహనదారులకు తప్పని నరకయాతన

ప్రజాశక్తి - పార్వతీపురం

సాలూరు నుంచి మక్కువ మండల కేంద్రం మీదుగా దుగ్గేరు వరకు నిర్మించాల్సిన రోడ్డు సంకట స్థితిలో పడింది. సమీప భవిష్యత్తులో ఈ రోడ్డు నిర్మాణం పూర్తయ్యే అవకాశాలు లేవు. ఇప్పటికే సాలూరు నుంచి మక్కువ వరకు రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. పెద్దపెద్ద గుంతలతో రోడ్డు నిండిపోయింది. ద్విచక్రవాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్టీసి సంస్థ ఈ రోడ్డు మీదుగా నడిపే బస్సులను చాలా వరకు తగ్గించింది. ఈ రోడ్డు మీదుగా ప్రయాణించడానికి వాహనదారులు ఇష్టపడడం లేదు. ఇదే మార్గంలో దాదాపు 15 గ్రామాలు ఉండడంతో వారంతా తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. ఆటోలకు అధిక చార్జీలు చెల్లించి ఆయా గ్రామాల ప్రజలు ప్రయాణం చేయాల్సి వస్తోంది. గత ప్రభుత్వం హయాంలో ఈ రోడ్డు నిర్మాణానికి న్యూడెవలప్మెంట్ బ్యాంక్ నిధులు రూ.56 కోట్లు మంజూరయ్యాయి. రోడ్డు విస్తరణతో పాటు మధ్యమధ్యలో ఉన్న కల్వర్టులు, వంతెనల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అయితే ఈ రోడ్డు మార్గంలో ఉండే కల్వర్టులు, వంతెనల నిర్మాణం పూర్తయింది. ఇలాంటి పరిస్థితుల్లో గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. టిడిపి అధికారంలోకి వస్తే రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని ఆ పార్టీ నాయకులు హామీ ఇచ్చారు. కానీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కావస్తోంది. ఎక్కడ పనులు అక్కడే వున్నాయి. వేసవి మూడు నెలల్లోనే ఈ రోడ్డు పనులు పూర్తి కావాల్సి ఉంది. కానీ ఈ మూడు నెలల్లో పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

అర్థాంతరంగా నిలిచిపోయిన మక్కువ-సాలూరు రోడ్డు

నిధుల దారి మళ్ళింపుతో పనులకు ఆటంకం

కొండ నాలుకకి ముందు వేస్తే వున్న నాలుక ఊడిందన్న పరిస్థితి లా ఉంది ఇప్పుడున్న ప్రభుత్వం తీరు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఏకంగా మంజూరైన నిధులకే కోత పెట్టింది. గత ప్రభుత్వం హయాంలో మంజూరైన న్యూడెవలప్మెంట్ బ్యాంక్ నిధులు 56 కోట్లను టిడిపి ప్రభుత్వం రూ.10.82 కోట్లకు తగ్గించింది. దీంతో ఈ రోడ్డు నిర్మాణం పూర్తయ్యే అవకాశం లేదు. మంజూరైన పదికోట్లతో కొంతవరకు మాత్రమే రోడ్డు నిర్మాణం జరిగే అవకాశం ఉంది. మక్కువ నుంచి సాలూరుకు మధ్య దూరం 20కిలోమీటర్లు. ఇప్పటికే కాంట్రాక్టర్ ఈ రోడ్డు మార్గంలో పాయకపాడు నుంచి మక్కువ వరకు బిటి మెటీరియల్ పరిచి వుంచారు. దానిపైన తారు వేస్తే బిటి రోడ్డు అవుతుంది. అందుచేత కాంట్రాక్టర్ పాయకపాడు నుంచి మక్కువ వరకు బిటి రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తానని చెపుతున్నారు. సాలూరు నుంచి పాయకపాడు వరకు రోడ్డు నిర్మాణం చేయడానికి నిధులు చాలని పరిస్థితి కనిపిస్తోంది. మంజూరైన రూ.10 కోట్లుతో రోడ్డు నిర్మాణం చేసి చేతులు దులుపుకోవాలని కాంట్రాక్టర్ భావిస్తున్నారు. మంజూరైన మొత్తం నిధుల్లో రూ.46కోట్లు వరకు ప్రభుత్వం వెనక్కి తీసుకోవడంతో ఈ రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోనుంది. మళ్లీ అధికారులు మిగిలిన పనికి అంచనా వేసి నిధులు కోసం ప్రభుత్వానికి పంపిన తర్వాత మంజూరైతే తప్ప రోడ్డు పూర్తి కాని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఈ ప్రాంత ప్రజలు మరికొంత కాలం ఇక్కట్లు పడక తప్పని పరిస్థితి ఏర్పడింది.

జీగిరాం జ్యూట్‌మిల్లు తెరిపించాలి : సిఐటియు

ప్రజాశక్తి - సాలూరురూరల్

పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న ఏకైక పరిశ్రమ మండలంలోని జీగిరాం జ్యూట్ మిల్ అని, దాన్ని వెంటనే కూటమి ప్రభుత్వం తెరిపించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు, కార్యదర్శులు ఎన్‌వై నాయుడు, బివి రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు జ్యూట్ మిల్ కార్మికులు 50 రోజులకు పైగా సమ్మె చేస్తే సమ్మె శిబిరానికి ప్రస్తుత మంత్రి గుమ్మడి సంధ్యారాణి హాజరై టిడిపి అధికారంలోకి వస్తే జ్యూట్ మిల్లును తెరిపించి, ఈ ప్రాంత కార్మికులకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆమె గెలిచి నేడు ఎనిమిది నెలలు గడుస్తున్నా నేటికీ జ్యూట్ మిల్ వైపు కన్నెత్తి చూడడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీని అమలు చేయాలని, జూట్ మిల్లు తెరిపించి వెంటనే కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ ప్రాంత కార్మికులందరికీ కలిపి ఆందోళనకు సిద్ధం చేస్తామని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం చెబుతున్నట్లు సంపద సృష్టించడమంటే ఫ్యాక్టరీలు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించడం కాదా అని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ కూడా దృష్టిసారించి జ్యూట్ మిల్లును వెంటనే తెరిపించి కార్మికులందరికీ ఉపాధి కల్పించాలని కోరారు. లేకుంటే లేకుంటే ఆందోళనకు ధ్దపడతామని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు రమణ, నాయుడు, రమణారావు

విద్యార్థి తల్లిదండ్రులకు కరపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

మనబడిని బలోపేతం చేద్దాం రండి

ప్రజాశక్తి - వీరఘట్టం

మన ఊరు బడిని మనం బలోపేతం చేసుకుందాం రండి అంటూ మండలంలోని కిమ్మిలో ఆ గ్రామ పాఠశాల ఉపాధ్యాయులు ఆదివారం ఇంటింటికి వెళ్లి ప్రచారం చేపట్టారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన బోధనతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని, మీ పిల్లల భవిష్యత్తు మీ చేతుల్లో ఉందని అన్నారు. కావున ఆలోచించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పిల్లలకు అవగాహన కల్పించి ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు బంకురు అప్పలనాయుడు, బి.వాసుదేవరావు, కొండపల్లి గౌరునాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాలి

ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి - కురుపాం

మన్యంలో గల గిరిజన గ్రామాలన్నింటికీ మౌలిక వసతులు కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘ మండల కార్యదర్శి బి.అనిల్, ఆరిక గంగరావు డిమాండ్ చేశారు. మండలంలోని తిత్తిరి, వలసబల్లేరు పంచాయతీలో గల పలు గిరి శిఖర గ్రామాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవిరి గ్రామం నుంచి ఎగువ కీడవాయి వరకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అత్యవసర సమయంలో వాహనాల రాకపోకలకు చాలా అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి తోడు వేసవిలో తాగునీరు సమస్యతో ఇబ్బంది పడుతున్నారని, ఉన్న ఒక్క బావి నుంచి నీరు తాగుతున్నారని, రెండు కిలోమీటర్ల దూరాన వెళ్లి తెచ్చుకుంటన్నారని తెలిపారు. ఈ బావికి మోటర్ పెట్టి ఊరి దగ్గర ట్యాంక్ పెట్టినా వేసవిలో బావిలో నీరు ఇంకిపోయి ఇబ్బందులకు గురవుతున్నారని కావున ప్రజా ప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించి రహదారి, తాగునీటి సదుపాయం కల్పించాలని ఆదివాసి గిరిజన సంఘం తరపున డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే గిరిజనులతో కలిసి మండల కార్యాలయాల్లో ఆందోళన చేపడతామని అన్నారు.

బావి వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు, గిరిజన సంఘం నాయకులు

ఈదురుగాలులతో దెబ్బతిన్న అరటి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని ఆదివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు అరటిపండుకు నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శంబర, మార్కొండపుట్టి, నంద తదితర పంచాయతీల్లో అరటి పంట దెబ్బతినడంతో చేతికొచ్చిన పంట దెబ్బ తినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే మండల కేంద్రంలో చెముడు వెళ్లే రహదారిలో కొబ్బరి చెట్టు విరిగి విద్యుత్ తీగెలు తెగి కింద పడ్డాయి. విద్యుత్ శాఖ సిబ్బంది తక్షణమే స్పందించడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం వాటిల్లకుండా విద్యుత్ వైర్లను అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టారు.

గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు

కొత్త అంబులెన్సులు ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో గల గిరిజన ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేసిందని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి కొత్తగా మంజూరైన అంబులెన్స్ సర్వీస్‌ను ఆదివారం ఆమె రిబ్బన్ కట్ చేసి, జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంబులెన్స్ సర్వీస్‌ను మండలంలోని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పాడి సుదర్శనరావు, జనసేన సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు, నాయకులు దొంకాడ రామకృష్ణ, నిమ్మక సింహాచలం, కూటమి నాయకులు, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

రాయితీ పరికరాలపై రైతుల అనాసక్తి

బయట మార్కెట్ కంటే ప్రభుత్వం వద్ద అదనపు రేటు

ప్రజాశక్తి - సాలూరురూరల్

వ్యవసాయ సాగులో కూలీల ఖర్చు తగ్గించేందుకు రైతులు యాంత్రీకరణ వైపు మొగ్గు చూపేలా ప్రభుత్వం రాయితీపై పరికరాలను అందజేస్తుంది. ఐదు ఎకరాల కన్నా తక్కువ ఉన్న రైతులకు ఈ పరికరాలను ప్రభుత్వం అందజేస్తుంది. అయితే ఈ వ్యవసాయ పరికరాలను తీసుకొనేందుకు రైతులు వెనుకడుగు వేస్తున్నారు. బయట మార్కెట్ కంటే ఎక్కువ ధరలు ఉండడంతో వీటిని తీసుకోవడానికి రైతులు ముందుకు రానట్టు తెలుస్తుంది. మండలంలో ఇప్పటి వరకు కేవలం 25శాతం మాత్రమే ఈ పథకం కోసం ఆన్లైన్లో నమోదు చేసుకున్నట్టు తెలుస్తుంది. మండలంలో ఐదు ఎకరాల్లోపు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వ నిబంధన ప్రకారం 50శాతం రాయితీపై, మరికొందరికి నిర్దేశిత మొత్తం రాయితీగా నిర్ణయించి వ్యక్తిగతంగా అందించేందుకు యంత్ర సామాగ్రి పథకాన్ని ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అయితే దరఖాస్తులు చేయడానికి రైతులు ఎక్కువగా ఆసక్తి చూపడం లేదు.

ఈ పరికాలపై రైతులు ఆసక్తి చూపకపోవడానికి ప్రధాన కారణం ధరల్లో వ్యత్యాసం. ప్రస్తుతం రాయితీపై అందజేస్తున్న యంత్ర సామాగ్రిని బహిరంగ మార్కెట్లో తక్కువ రేట్లకు లభిస్తుండడంతో వీటిపై రైతులు ఆసక్తి చూపడం లేదు. ట్రాక్టర్ కల్టివేటర్ రూ.43200ను ప్రభుత్వం రేటును ప్రకటించింది. ఇందులో రైతు చెల్లించాల్సింది 50శాతం సబ్సిడీ పోనూ రూ.21వేలకు వస్తుంది. బహిరంగ మార్కెట్లో వీటిని తూకం బట్టి ఇస్తారని, ఇది ఇంత రేటు ఉండదని రైతుల అభిప్రాయం. తైవాన్ బ్యాటరీ స్ప్రేయర్ ప్రభుత్వం ధర రూ.26 వేలు ఉండగా, రూ.10వేలు సబ్సిడీ పోనూ రైతులు రూ.16వేలకు డిడి ద్వారా జమ చేయాలి. అయితే ఇది బహిరంగ మార్కెట్లో ప్రభుత్వం

నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ యాత్రీకరణ పరికరాలు

నిర్ణయించిన ధర కంటే నాలుగు నుంచి ఐదువేల రూపాయలు తక్కువగా ఉంటుంది. దీన్ని ఎక్కువగా చూపించి రైతులకు తక్కువ సబ్సిడీని అందించడానికి కంపెనీలు ప్రయత్నిస్తున్నా అధికారులు మాత్రం కంపెనీలు ప్రకటించిన ధరలు మాత్రమే చూపించి రైతుల వద్ద అదనంగా తీసుకుంటున్నారు. ఇలా అన్ని పరికరాల ధరలు ఎక్కువగానే ఉన్నాయి. దీంతో రైతులెవరూ రాయితీ ద్వారా పరికరాలు తీసుకొనేందుకు ముందుకు రావడం లేదని అర్థమవుతుంది. యంత్ర పరికరాలు తయారు చేసే కంపెనీలకు అదనపు ధరలు చెల్లించి రైతులను మోసగించడం ఎంత వరకు సమంజసమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించి ధరలను తగ్గించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

గుంపుస్వామి ఆలయానికి విచ్చేసిన జడ్జి అరుణశ్రీ దంపతులు

గుంప సోమేశ్వరస్వామిని దర్శించుకున్న న్యాయమూర్తి

ప్రజాశక్తి - కొమరాడ

నాగావళి, జంఝావతి నదుల సంగమంలో వెలసిన సోమేశ్వర స్వామిని ఆదివారం బొబ్బిలి అసిస్టెంట్ సెషన్ జడ్జి న్యాయమూర్తి ఎస్.అరుణశ్రీ దర్శనం చేసుకున్నారు. ఆలయానికి వచ్చిన న్యాయమూర్తి దంపతులకు శ్రీ కాపర్పు ఫౌండేషన్ తరపున సభ్యులు ఎస్.వెంకటరమణ శాలువాతో సత్కరించి ఆహ్వానం పలికారు. అనంతరం సోమేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అర్చకులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు దేవ్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలు రాస్తున్న విద్యార్థినులు

గురుకులంలో ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక బాలికల, బాలురు గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి ఆదివారం పరీక్ష నిర్వహించారు. సీతంపేట పరీక్షా కేంద్రంలో బాలికల ప్రవేశానికి ఐదో తరగతికి 186 మంది, ఆరో తరగతికి గాను 172 మంది, ఏడో తరగతి 24 మంది, 8వ తరగతి 56 మంది, తొమ్మిదో తరగతికి ఒకరు పరీక్ష రాశారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ప్రిన్సిపాల్ డి.అరుణజ్యోతి తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ పి.సూర్యకుమారి పరీక్షలను పర్యవేక్షించారు. అలాగే స్థానిక ఐటిడిఎ సమీపంలో గల బాలుర గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలో ప్రవేశానికి 271మంది విద్యార్థులు పరీక్ష రాశారు ఈ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా ప్రిన్సిపల్ జి.నీలన్నాయుడు, పరిశీలకులుగా జి.కృష్ణమోహన్ వ్యవహరించారు.

తహశీల్దార్‌గా సాయి కామేశ్వరరావు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - కొమరాడ

మండల తహశీల్దార్‌గా ఎ.సాయి కామేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన తహసీల్దార్‌గా ఉద్యోగన్నతిలో భాగంగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో తహశీల్దార్‌గా పనిచేసిన రమేష్ బదిలీపై శ్రీకాకుళం జిల్లాకు వెళ్లిపోయారు. దీంతో అనకాపల్లి జిల్లాలో ల్యాండ్ సర్వే డిపార్టుమెంటుకు చెందిన డిటి సాయికామేశ్వరరావు ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

నవధాన్యాలతో నేలకు రక్షణ

ప్రజాశక్తి - పాచిపెంట

ఏప్రిల్, మేలో ఎండ వేడి తీవ్రంగా ఉండడం వల్ల నేలలో ఉన్న పోషకాలు వేడికి గాలికి ఆవిరి అయిపోవడమే కాకుండా సారవంతమైన మట్టి కూడా కొట్టుకొపోతుందని మండల వ్యవసాయాధికారి తిరుపతిరావు అన్నారు. మండలంలోని పాంచాలిలో రైతు నారాయణరావు పొలంలో నవధాన్యాలను చల్లిస్తూ నవధాన్యాల సాగు నేలకు రక్షణ కవచమని, రైతులు తప్పనిసరిగా నవధాన్యాలు వేసుకుని కలియ దున్నుకుంటే నేల సారవంతమవ్వడమే కాకుండా సారవంతమైన మట్టి కొట్టుకుని పోకుండా రక్షణ కవచంగా పనిచేస్తుందని తెలిపారు. రూ.500 ఖర్చు కోసం చూడకుండా తప్పనిసరిగా నవధాన్యాలను చల్లుకోవాలన్నారు. నవధాన్యాలు కావాల్సిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాలనైనా, ప్రకృతి వ్యవసాయ బృందాన్ని అయినా సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ప్రకృతి సేద్యం ఎల్ వన్ తిరుపతి నాయుడు, రైతులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు డ్రమ్ములు, టార్పాన్లు అందజేస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

సేంద్రీయ వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - కురుపాం

సేంద్రీయ వ్యవసాయంతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ విస్తరణ సంచాలకులు జి.శివన్నారాయణ అన్నారు. మండలంలోని రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు సేంద్రీయ వ్యవసాయ సాగు పద్ధతులపై అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో చిన్న, సన్న కారు రైతులు సేంద్రీ వ్యవసాయం చేయడం వల్ల తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని, కావున ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయం చేయాలని సూచించారు. అనంతరం రైతులకు సబ్సిడీతో కూడుకున్న టార్పర్లు, ప్లాస్టిక్ డ్రమ్ములను అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.వి.కి సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

లక్ష్మీపురం సర్పంచ్ ఆకస్మిక మృతి

ప్రజాశక్తి - సీతానగరం



మండలంలోని లచ్చయ్యపేట సర్పంచ్ చింతాడ కృష్ణ (43) ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా మృతి చెందారు. అప్పటి వరకూ తమతో మాట్లాడిన కృష్ణ మృతి చెందాడన్న వార్తను గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. కృష్ణ మృతికి మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు విచారం వ్యక్తం చేశారు. ఆయన మృతి పట్ల కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పాఠశాలను కొనసాగించాలి

ప్రజాశక్తి- బాడంగి

తమ గ్రామంలో ఉన్న పాఠశాలను యధావిధిగా కొనసాగించాలని ఎరుకలపాకలు గ్రామస్తులు కోరుతున్నారు. పూర్తిగా ట్రైబల్ పాఠశాలగా పిలవబడే పాఠశాలలో సుమారు 19 మంది విద్యార్థులు ఉన్నారని, వీరందరినీ పక్కనే ఉన్న గజరాయనివలస పాఠశాలకు తరలించడంతో హైవే రోడ్డును దాటుకుని వెళ్ళవలసి వస్తుందని చెప్పారు. వెళ్లేదారిలో ఇదివరకే చాలా ప్రమాదాలు జరిగాయని గుర్తు చేశారు. అందుకే తమ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం పాఠశాలలో కేవలం ముగ్గురు విద్యార్థులే ఉన్నారని, వారికి ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారని గుర్తు చేశారు. గ్రామస్తులు, పంచాయతీ, విద్యాశాఖ తీర్మానంతో ఒకటి రెండు తరగతులను లక్ష్మీపురంలో, ఒకటి నుండి ఐదు తరగతులు ఎరుకులపాకల గ్రామంలో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - సాలూరురూరల్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలను సాలూరు పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి క్యాంప్ కార్యాలయం నుంచి నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీగా కన్యకా పరమేశ్వరి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు పళ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్, పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, పట్టణ, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : స్థానికఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సిఎం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముందుగా ఎల్విన్‌పేట కూడలిలో గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. వినాయకుని గుడిలో చంద్రబాబు పేరున ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్యాంప్ కార్యాలయంలో కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి, సంబరాలు జరుపుకున్నారు. మహిళలకు చీరలు, యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం, జియమ్మ వలస మండలాల టిడిపి అధ్యక్షులు పాడి సుదర్శన్ రావు, పల్లా రాంబాబు, జనసేన సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, ఎఎంసి చైర్పర్సన్ కడ్రక కళావతి, అరకు పార్లమెంటు అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, నాయకులు డి.వెంకట నాయుడు, నందివాడ కృష్ణబాబు, వెంపటాపు భారతమ్మ, అడ్డాకుల నరేష్, నిమ్మక సింహాచలం, శ్రీనివాసరావు, సుబ్బలక్ష్మి, రంజిత్ కుమార్ నాయకో, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కురుపాం : సిఎం చంద్రబాబు నాయుడు 75 వ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయం వద్ద మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక సిహెచ్‌సిలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, ట్రైకార్ బోర్డు మెంబర్ పువ్వల లావణ్య, టిడిపి నాయకులు జివి రమణమూర్తి, చందక రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక టిడిపి కార్యాలయంలో సిఎం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో తోటపల్లి ప్రాజెక్టు మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగ, సీనియర్ నాయకులు పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, మండల అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి సిహెచ్ ఉమామహేశ్వరరావు, బల్ల హరిబాబు మాచర్ల అనిల్, ఎ.కుమారస్వామి, బి.నీలకంఠం నాయుడు, ఆర్.రత్నాకర్, కె.రామకృష్ణ, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు. అంతకు ముందు పిహెచ్‌సిలో గర్భిణీలకు పండ్లు పంపిణీ చేశారు.

మక్కువ : సిఎం చంద్రబాబు 75 వ పుట్టినరోజు సందర్భంగా శంబరలో టిడిపి ఎంపిటిసి తీళ్ల పోలినాయుడు, అరుకు పార్లమెంట్ అధికారప్రతినిధి అక్యాన తిరుపతి రావు కేకు కట్ చేసి టిడిపి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం మెడికల్ క్యాంప్ నిర్వహించి వృద్ధులకు మందులు పంపిణీ చేసి, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : సిఎం చంద్రబాబు జన్మదినోత్సవ వేడుకలు స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం మండలాల నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు తరలిరాగా, ముందుగా సర్వమత ప్రార్ధనలు నిర్వహించి కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక జిల్లా కేంద్రాసుపత్రిలో రోగులకు ఎమ్మెల్యే పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే పట్టణంతో పాటు మండలంలో పలుచోట అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జి.వెంకటనాయుడు, బెలగం జయప్రకాశ్‌నారాయణ, చంద్రమౌళి చంటి, గురజాన చంద్రమౌళి,ఎఎంసి మాజీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు, పలువురు సర్పంచులు ఎంపీటీసీలతో పాటు మాజీ

కురుపాంలో కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు వీరేష్‌చంద్రదేవ్

కేక్ కట్ చేస్తున్న మంత్రి సంధ్యారాణి

ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కళాకారుల సంఘం ఆధ్వర్యంలో

మన్యం జిల్లా కళాకారుల సంఘం, శివ శివాని పౌరాణిక కళాకారుల సంఘం ఆధ్వర్యంలో నర్సిపురంలో ఆ సంఘం అధ్యక్షులు బడి శ్రీరాములు ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలను నిర్వహించారు. మన్యం జిల్లాలో కళాకారులను గుర్తించి ముగ్గురికి కందుకూరి వీరేశలింగం పురస్కారాన్ని అందించడంలో కృషిచేసిన సిఎం చంద్రబాబుకు, కళాకారుల సంఘం నాయకులు గుమ్మడి గోపాలకృష్ణకు ఈ సందర్భంలో వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైతు వాసుదేవరావు ఎడ్ల గోపాలరావు, మంగాదేవి, మువ్వల వెంకటరమణ, అమరాపు రామకష్ణతో పాటుగా జిల్లాకు చెందిన పౌరాణిక కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : సిఎం చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను జియమ్మ వలస మండలం కుదమలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, మండల టిడిపి అధ్యక్షులు పల్లా రాంబాబు, నీటి సంఘం అధ్యక్షులు లక్ష్మనాయుడు పాల్గొన్నారు.

భామిని : మండల టిడిపి అధ్యక్షులు భోగాపురపు రవినాయుడు ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు కేక్ కట్ చేశారు.కార్యక్రమంలో భామిని సర్పంచి లోపింటి రాజేష్, మండల టిడిపికమిటీ సభ్యులు బిడ్డికి ప్రసాద్, సాకెట్ రామారావు, జిల్లేరు రవికుమార్, సాసూపిల్లి రాజు, నిమ్మల మురళి, గొల్ల మధు, కోరాడ రాజేష్ పాల్గొన్నారు.

సీతానగరం : చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు మండలంలోని లక్ష్మీపురంలో టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ ని కట్ చేసి కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మజ్జి సాయి దత్తు, సత్యనారాయణ, బోను శ్రీనివాసరావు, మజ్జి ధనుంజయ, చందక ఉమామహేశ్వరరావు, పెరుమల ప్రియ, చొక్కల ఈశ్వరరావు, పెరుమాళ్ గడ్డియ్య, బొత్స అప్పలనాయుడు, లక్ష్మణరావుతో పాటు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

పూర్ణపాడు- లాబేసు వంతెన పూర్తిచేయాలి

ప్రజాశక్తి కొమరాడ

వర్షాలు రాకముందే పూర్ణపాడు- లాబేసు వంతెన నిర్మాణం పూర్తి చేయాలని సిపిఎం, కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు వి.దాలినాయుడు, గేదెల రామకష్ణ, సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి పూర్ణపాడు-లాభేసు గ్రామాల మధ్య అసంపూర్తి నిర్మాణంలో ఉన్న వంతెనను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా గిరిజనులను పూర్ణపాడు లాబేసు వంతెన ఊరిస్తోందన్నారు. వైసిపి, టిడిపి ఈ వంతెనను ఎన్నికల హామీగా వాడుకున్నాయని ఆరోపించారు. ఈ వంతెన నిర్మాణంలో వైసిపి వైఫల్యం చెందిందన్నారు. ఎన్నికల్లో ఈ వంతెన నిర్మాణం పూర్తి చేస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి పాలకులైన ఈ ఏడాది వర్షాలు రాకముందే వంతెన నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. వంతెన లేకపోవడంతో నది ఆవల గ్రామాల ప్రజలు అత్యవసర సేవలందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వంతెన లేకపోవడంతో నాటు పడవల ప్రమాదాలతో ప్రజలు మృత్యువాత పడిన సంఘటనలు గుర్తు చేశారు. కాబట్టి తక్షణమే పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి వర్షాకాలానికి ముందే పూర్ణపాడు- లాబేసు మిగతా పనులు పూర్తి చేసి ప్రజలకు మంచి చేయాలని కోరారు.

డైట్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గల గిరిజన సంక్షేమ వసతి గృహాలకు మెస్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు పల్ల సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగిసినా ఇంతవరకు వసతి గృహాలకు మూడు నెలలుగా బకాయిలను ప్రభుత్వం విడుదల చేయలేదన్నారు. దీంతో వసతి గృహాల్లో సిబ్బంది, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారులు స్పందించి వెంటనే వసతి గృహాలకు పెండింగులో ఉన్న డైట్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు.

జీడి పిక్కల ఫ్యాక్టరీ నడిపించేందుకు ఆర్థిక సాయం అందించాలి

ప్రజాశక్తి - కొమరాడ

జీడిపిక్కల ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి మూడేళ్ల అవుతున్నా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం రూ.2లక్షలు లేక ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్న దళిత కుటుంబానికి చెందిన బొమ్మాలి వినోద్‌ను అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. కొమరాడలో రూ.40 లక్షలతో ఏర్పాటు చేసిన జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ పరిశ్రమని సిపిఎం నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొమ్మాలి వినోద్ మూడేళ్ల క్రితం జీడి పరిశ్రమ స్థాపించారని, ఈ పరిశ్రమలో 20 మందికి ఉపాధి కల్పించడంతో పాటు ప్రతిరోజు టన్ను జీడి పిక్కలు ఆడించే సామర్థ్యం గల పరిశ్రమను స్థాపించారన్నారు. అయితే దీనికి సంబంధించి విద్యుత్ కనెక్షన్ కోసం రూ.2లక్షల్లేక మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం కోసం కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేదన్నారు. ఇంతవరకు రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అటు పాలకులు గానీ, ఇటు జిల్లా స్థాయి కలెక్టర్ గానీ సహాయం చేయకపోవడంతో మూడేళ్లుగా ఈ జీడి పరిశ్రమ కరెంటు లేక నిరుపయోగంగా ఉందని అన్నారు. ఇప్పటికైనా జీడిపిక్కలు కిలో రూ.200 కొనుగోలు చేసి కొమరాడ మండల కేంద్రంలో ఉన్న వినోద్ వద్ద జీడి పరిశ్రమను ప్రభుత్వం తీసుకున్న లేక వెలుగు ద్వారా జీడి పిక్కలు కొనుగోలు చేసి వినోదకు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వినోద్ పాల్గొన్నారు.

ఇదేనా స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర?

ప్రజాశక్తి - వీరఘట్టం

దశమంతపురం రోడ్డుపక్కను పేరుకుపోయిన చెత్తపోగులు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఒకవైపున అధికారులు ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో మాత్రం ఎక్కడా కానరావడంలేదు. ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నా అది ప్రచారానికి పరిమితమవుతుంది. ఇందుకు నిదర్శన పలు గ్రామాల్లో రోడ్లపైనా, కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలే. మండలంలోని వీరఘట్టంలోని పలు ప్రధాన కాలువల్లో చెత్తపేరుకుపోవడంతో కాలువల నుంచి దుర్వాసన వెదజల్లుతోంది. అలాగే దోమలకు ఆవాసాలుగా మారాయి. అలాగే పలు గ్రామాల్లో రోడ్లపక్కనే చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్త సంపద కేంద్రాల ద్వారా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడుతుందనుకున్నా చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగం పడిపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఎక్కడికక్కడే చెత్త పేరుకుపోయింది. దీంతో ప్రజలు రోగాలబారినపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయ అభివృద్ధికి అటవీ శాఖ అడ్డగింత

గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తాం : దోనుబాయి గ్రామస్తులు

ప్రజాశక్తి - సీతనగరం

మండలంలోని ధోనుబాయిలో అటవీ శాఖ బంగ్లా పక్కనే దుర్గమ్మ గుడి వెలిసింది. సుమారు 60ఏళ్ల నుంచి చుట్టుపక్కల గ్రామాల ఆరాధ్య దైవంగా ఈ గ్రామస్తులు కొలుస్తుంటారునిసర్పంచ్ కూరంగి వెంకి నాయుడు, ఎంపీటీసీ కోటేశ్వరరావు, గ్రామస్తులు రామస్వామి, రవీంద్ర, రవి, చంద్రమ్మ తెలిపారు. ఈ గుడికి అప్పట్లో గ్రామ దేవత గుడి కింద అటవీశాఖ అధికారులు 87 సెంట్లు పట్టా ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం దుర్గమ్మ గుడి దిన దినాభివృద్ధి చెందుతూ వస్తుంది. దుర్గమ్మగుడి అభివృద్ధితో పాటు వివిధ కార్యక్రమాలు చేసుకోవడానికి స్టేజి కూడా నిర్మించామని చెప్పారు. ఇటీవల కాలంలో చుట్టు పక్కల ప్రహరీ గోడ నిర్మించినప్పుడు అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. రెవెన్యూ అధికారులు ధోనుబాయి వచ్చి గ్రామస్తుల అభిప్రాయాలు తీసుకొని వెళ్ళిపోయారని తెలిపారు. సోమవారం ఐటిడిఎలో పిఒకు పబ్లిక్ గ్రీవెన్స్‌లో దుర్గమ్మ ఆలయ ప్రహరీ గోడ నిర్మాణానికి అనుమతి కోసం గ్రామస్తులుమంతా కలిసి వినతిపత్రం సమర్పిస్తామని తెలిపారు. దీనిపై ఆర్ఐ విజయ గణేష్ వద్ద ప్రస్తావించగా గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు

అటవీశాఖ అధికారులతో మాట్లాడుతున్న ధోనుబాయి గ్రామస్తులు

అభిప్రాయాలు సేకరించి నివేదిక ఉన్నతాధికారులకు సమర్పించామని సమాధానం ఇచ్చారు. దీనిపై అటవీశాఖ ధోనుబాయి బీట్ అధికారి ప్రభాకర్ వద్ద ప్రస్తావించగా గుడికి రిజర్వాయర్ ఫారెస్ట్‌లో ఆర్ఒఎఫ్ ఆర్ పట్టా ఇచ్చారని తెలిపారు. రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు జాయింట్ సర్వే చేయాలని సమాధానం ఇచ్చారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని మదనాపురం గ్రామంలో ఆదివారం కంకరు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ వర్రీ రామారావు (45) అక్కడికక్కడే మృతి చెందాడు. కంకరు లోడుతో మదనాపురం జంక్షన్ నుండి మదనాపురం గ్రామంలోనికి వెళ్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి చెరువులోనికి బోల్తా పడడంతో ఇంజన్ కింద పడి డ్రైవర్ రామారావు మృతి చెందారు. రామారావుకి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సాయికృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

ఉరేసుకుని విమానాశ్రయ కూలీ మృతి

ప్రజాశక్తి - భోగాపురం

విమానాశ్రయ పనులకు వచ్చి విద్యుత్ స్తంభానికి ఉరివేసుకొని జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి శనివారం రాత్రి మృతి చెందాడు. మండలంలోని పోలిపల్లి సమీపంలో హైవేకు ఆనుకుని ఉన్న లేఔట్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సురేష్ భూయాన్ (47) విమానాశ్రయ నిర్మాణ పనుల కోసం వచ్చాడు. ఏమైందో తెలియదు గానీ పోలిపల్లి లేఔట్ లోపల శనివారం రాత్రి విద్యుత్ స్తంభానికి ఉరివేసుకున్నాడు. ఉదయాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విమానాశ్రయ కూలీగా పోలీసులు గుర్తిం చారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

ఘనంగా ఈస్టర్ వేడుకలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని రావాడ రోడ్డు కూడలి సమీపంలో గల గుడ్ సమారిటన్ లూథరన్ చర్చి, దొనకవీధిలో ఉన్న ఇమ్మానియేల్ లూథరన్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ డి. రాజు ఆధ్వర్యం లో ఆదివారం ఘనంగా ఈస్టర్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా క్రైస్తవులకు ఈస్టర్ పండగ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు డి.ప్రదీప్, రాజరత్నం, జయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక తెలుగు బాప్టిస్ట్ దేవాలయం, ఆర్‌సిఎం, సీయోను, ఇమ్మానియేల్ ప్రార్థనా మందిరాలతో పాటు తూడి, తలవరం, బిటివాడ, నడుకూరు, కంబర వలస, కంబర, మహాదేవివలస, నర్సిపురం, సింధునగర్ తదితర గ్రామాల్లో ఈస్టర్ పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తెలుగు బాప్టిస్ట్ దేవాలయ సంఘ పాస్టర్ వి శంకర్ ఏసుక్రీస్తు మరణించిన మూడో దినాన లేచినని లేఖనం ప్రకారం భక్తులను ఉద్దేశించి మాట్లాడారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని దిగువమండ చర్చిలో ఈస్టర్ వేడుకలను నిర్వహించారు. ఓఫిర్ మినిస్ట్రీస్ ఇంటర్నేషనల్ జిల్లా అధికార ప్రతినిధి పాస్టర్ నిరీక్షణ కుమార్ ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో- ఆర్డినేటర్ అడ్డకుల చిన్నారావు మాట్లాడుతూ సార్వాత్రిక సంఘాలకు, సేవకులకు, విశ్వాసులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు..